# బడి తనిఖీ

రచన

"సౌమ్యశ్రీ"

ఒక దమ్మిడీ సంపాదనలేదు, ఒకక్షణం తీరిక లేదు. మాలో మేము కాళ్లు తొక్కుకుంటున్నాం. గార్డెన్ అంతా శుభ్రం చేశాం. పిలకలువేసిన పచ్చగడ్డినంతటినీ పిల్లలచేత పీకివేయించాం జానెడుఎత్తున ఒండ్రుమట్టిపోసి, అణామెంతులను కొని, "జైహింద్" మాదిరిగా చల్లాం.

"ఇవాళ రావచ్చుబహుశా" అన్నాడొకాయన ముక్కుక్రిందకు పడిపోతున్న కళ్ళజోళ్లు పైకి లాక్కొని 'పాతికేళ్ళనుంచి చేస్తున్నా ఈ ఉద్యోగాన్ని వస్తానన్న రోజుకు వారువారు" అని ఓకాయన అంటే—

"పన్నెండు గంటల బస్సులో " అని ఇంకోయన అసంపూర్తి వాక్యాలతో వెళ్ళిపోయాడు.

"వస్తున్నారండీ" అని బంట్రోతు చెప్పేటప్పటికి, మేమంతా కోట్లు సద్దుకొని, గొంతుకలు సవరించుకొన్నాం ఒకసారి.

"స్వస్తజాగ్రత్త" అన్నట్లుగా హెడ్‌మాష్టరు కొత్తగా బి. ఏ. ప్యాసయి వాడునావంక చూచారు. ఇన్‌స్పెక్షన్ అనేమాట రాగానే అపాదమస్తకం వణికిపోయాం. పోస్టు జవాను రాగానే పీడే నంటు బంట్రోతు అనగానే మేమంతా పొట్టలు చెక్కలయ్యేటట్లు నవ్వాం. డి. ఇ. ఓ. గారు భార్యాసమేతంగా వస్తారని వినగానే మాప్రాణాలు నిలువునా ఎగిరిపోయాయి కనీసం మాకు రెండు రోజులకు నలభైరూపాయలన్నా ఖర్చవుతుంది అసలే జీతాలు చాలక చస్తూంటే ఇందులో తిరపతి క్షవరంగూడాను! ఎదురించి చెప్పగల ధైర్య సాహసాలా లేవు వినయంగా వంగి విన్నపించే స్తోమతాలేదు. దాన్ని మీరు మా వీక్‌నెస్ అన్నా పిరికితనం అనిఅన్నా నేను ఏమీ అనను.

ఆరు గంటలకే లేవటం వారి ప్రవృత్తికి విరుద్ధం అయినా, బస్సు పోతుందనే భావంతో బయలుదేరి వచ్చారు. ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఇద్దరు గుమాస్తాలు, ముగ్గురు జమానులు, ఒక పనిచేసే మనిషితో. శ్రీవారు మా వ్యాకిదిగారు వారికి కావలసిన సదుపాయాలు చేసేటప్పటి మా తల తోకకు వచ్చింది పడుకోవటానికి మంచం పంపిస్తే నల్లులున్నాయని తిరక్కొట్టి పంపించారు. కాఫీ తీసుకొని వెళ్ళితే, మా ప్యూమను అర్థమైన తిట్లుతిట్టి "స్టుపిడ్" అనిపంపించారు అయ్యగారు "ఇడ్లీ"అని అంటే అమ్మగారువచ్చి "పూరీలని" పెద్దకూతురు "ఉప్మా"అని ఏకరువు పెట్టారు. మా ప్యూనుకు అవన్నీ తెలియక "వేడివేడి ఇడ్లీ పంపిందారండీ"అని అన్నాడు.

"అక్కరలేదు అని చెప్పు" అన్నారు అయ్యగారు.

"కాఫీ కావాలంటే—"

"ఫూల్ గెట్ అవుట్" అంది వారి సతీమణి.

"వక్కపొడి కావాలండి" అన్నాడు ఇంకా ఏమి తోచక

"మేం తెచ్చుకొన్నాంలే" అన్నాడు వాళ్ళ ప్యూను మా ప్యూనువంక మిరిమిరి చూస్తూ.

టైం అయింది. గడియారంలోని ముల్లు గిరిగిరా తిరుగూవున్నాది ఇ ఓ గారు గాని ఇన్‌స్పెక్టర్లుగాని స్కూలు వైపుకు రానేలేదు. ఒక ఇన్‌స్పెక్టరుగారు సనాతనుడు, రెండవ ఆయన నవనాగరికుడు అయన స్నానాలు, జపాలు, మంత్రాలు పూర్తి చేసుకొని భోజనం చేసేటప్పటికి వంటిగంట అవుతుంది రెండవ ఆయన అన్నంతిని రెండాకులు నమిలి, అరక్క మంచం మీద రెక్కవాల్చి విశ్రాంతి తీసుకొనేసరికి మూడు

గంటలు గొట్టారు. ఇక టిఫిన్ వేళ నాలుగు అయింది. మా స్కూలు వదిలేవేళగూడవచ్చింది. ఇంకా పది నిమిషాలుండగనగా ఇద్దరూ కాలు పెట్టారు. మీతో నిజం చెప్పుతున్నా, నమ్మండి నమ్మకపోండి. ఒకాయనకు కుండంతపొట్ట— రెండవ ఆయన పొట్టిగా, బంగాళ దుంపంత ఆకారంతో శరీరాన్ని దొర్లించుకుంటూ వస్తూంటే అర్థఊచలాగే వున్న మా హెడ్‌మాస్టరుగారు స్వాగతం యిచ్చారు. మేమంతా క్లాసుల్లో కూర్చుని పళ్లు యికిలించుకొని గడ్డాలు సవరించు కున్నాం. ఆ రోజు ఇన్‌స్పెక్షన్ అయిపోయింది.

ఇక మర్నాటి సంగతి: ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు వచ్చారు. పన్నెండు అయ్యేటప్పటికి సీనియర్ ఇన్‌స్పెక్టరుగారు క్లాసులోకి వెళ్ళి కుర్చీలో చతికిల బడ్డారు.

పాఠం చాలా సీరియస్‌గా వుంది- ఆయన అరమోడ్పుగన్నుగవతో ఏదో స్వప్నసీమలో విహరిస్తున్నారు. ఆ విధంగా వరుసగా రెండు పీరియడ్లు గడిచాయి- వారు లేచి వెళ్ళనూలేదు- టీచరు వెళ్ళమని చెప్పనూలేదు- నా క్లాసులోనికి వస్తారనే ఉద్దేశంలోనేముందుగా కొన్ని ప్రశ్నలు అడిగి, వాటికి సమాధానాలు చెప్పివుంచాను- వారు వచ్చి నన్ను ప్రశ్నలు అడగమంటే అవె అడుగుతాను- చకచకా చెప్పండి అనే టప్పటికి పిల్లలంతా రెడీ అన్నారు- జూనియర్ క్లాసులోనికి వచ్చి ఒకపద్యం చదివించండి అన్నారు నాతో-

"ఉప్పు కప్పురంబు నొక్కపోలికనుండు" అనే పద్యాన్ని చదవమన్నాను- మా ప్రియశిష్యుడు చదివితే "తప్పు" అన్నారు జూనియర్‌గారు- అందరిచేతా చదివించారు- "రాంగ్" అన్నారు- నన్ను చదవమన్నారు- నేనూ చదివాను, "హోప్లెస్" అన్నారు నా వంక చూస్తూ- "తమరు తప్పు దిద్దండి" అన్న ప్రార్థనాపూర్వకంగా- "అవె ఉప్పు కప్పురంబు ఒక్కపోలికనుండు, అని చదివి నా వంక మిరిమిరి చూసారు నేను వినయంగా వంగి నమస్కారం చేశాను అసలా పద్యంపేరు ఆటవెలది పుస్తకాలలో అలా వ్రాయకుండా ఆ॥ వె॥ అని వ్రాసి-పద్యం వ్రాస్తారు. అదిగూడా చదివి- చదివింపించాలని వారి భావన.

మధ్యాహ్నం మూడు. ఫలహారాల వేళ, కొద్దిసేపు విశ్రాంతి తర్వాత ఇన్‌స్పెక్షన్స్ కాంపు క్లరుకుగారు స్కూలునకు సంబంధించిన భోగట్టాను సేకరిస్తున్నారు. ఆటస్థలంలో ఆడపిల్లలు రింగు టెన్నీసు ఆడుతున్నారు. వాళ్ళవంక తీక్షణంగా జూస్తూ— "పాలుగారుతున్నాయండీ- ఇంకా రెండురోజులుంటే—"అని ప్రక్కవున్న రైటరును జూనియర్ ఇన్‌స్పెక్టరు అని అనుకొన్నాడు. రైటర్ ముఖం చూచేటప్పటికి నిలువునా నీరైపోయి వెళ్ళిపోయాడు. నాలుగంటలకు డి. ఇ. ఓ. గారు తనకంటె ముందుకు దొర్లుకువస్తున్న పొట్టతో. నోట్లో స్పెన్సర్సు చుట్టను పెట్టుకొని, పిల్లలను వెక్కిరించే పిల్లితలగాయగల చేతికర్రతో వచ్చారు- స్కూలుకు సిటిజన్ షిప్ ట్రెయినింగ్ అని సబ్జక్టు ప్రభుత్వంవారు అమలులో పెట్టారు. అది మీరు తప్పకుండా చదవాలి- దాన్ని అక్షరాలా పాటిస్తే మనమంతా స్పీకర్లుగాను, ప్రధాన మంత్రులుగాను యం. యల్. ఏ. లు గాను ఇంకా ఇంకా ఏవో ఏవోగా తయారవుతాం. అన్నారు.

ఐదు గంటలయేటప్పటికి వారి సతీమణి రెండు జళ్ళమధ్య పడీపడిపోతున్నట్లుగా పూలను పెట్టుకొని స్లిప్పర్సుతో వచ్చింది, ఆడపిల్లల విద్యా విషయంమీద సావధానంగా విని- సమగ్రంగా చర్చించారు. తోటంతాచూచారు- అరటి గెలల వంక తీక్షణంగా చూచేసరికి రెండు గెలలను ఇంటికి పంపించాం, వెండి గ్లాసునిండా వెన్న గాచిన నెయ్యిని పంపిస్తే—

చారేమోననుకొని అవతల పారబోసాడట పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వాంగాని మాఉదరాలు అలోమని ఏడ్చాయి. మర్నాడు కారుదాకా చేతులుగట్టుకొని వెళ్ళాం. ఆ రోజున పద్దు పుస్తకాలలో డి. ఇ. ఒ. ఇనస్పెక్షన్ తాలూకు తలకు 7-14-9అని పెద్దఅక్షరాలలో వ్రాసుకొన్నాం-తిరిగి వచ్చేటప్పుడు వస్తుందా అంటే కాళ్లువణుకుతున్నాయి.

ANANDAVANI is printed by V. AZIZULLA at Deccan Times Madras
Ed r& Publi hed by V. KALIDAS, at 12, Thambu Chetty Street